వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు వేయొచ్చు

- కుత్బుల్లాపూర్ రిటర్నింగ్ అధికారి పులి సైదులు
- పోలింగ్ బూత్‌కు రాలేని వారి పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశం





సమావేశంలో సూచలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి సైదులు, హాజరైన బీఎల్‌ఓలు, ఇతర సిబ్బంది

కుత్బుల్లాపూర్: ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని.. వారికి పత్రాలు అందజేసి సంతకం తీసుకుని.. వారు నడవలేని, ఓటింగ్ వేయలేని పరిస్థితిలో ఉన్నారా లేదా అన్న విషయాన్ని స్పష్టంగా తెలుసుకున్న తర్వాతనే పూర్తి నివేదికను తనకు అందజేయాలని కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు అన్నారు.

◆ సర్కిల్ కార్యాలయంలో గురువారం అసిస్టెంట్ ఎన్నికల అధికారులతో పాటు బీఎల్‌ఓలు, స్పెషల్ స్క్వాడ్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారికి ఆయా ప్రాంతాల వారీగా దరఖాస్తులు అందజేశారు. మొత్తం పదివేలకు పైగా దరఖాస్తులను ఆయా డివిజన్లు, వార్డులు పంపిణీ చేసి పూర్తి స్థాయిలో విచారణ జరపాలని సూచించారు. ఒకవైపు కొంపల్లి, దుండిగల్‌తో పాటు నగర మున్సిపల్ కార్పొరేషన్ నిజాంపేట్, కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్లలో ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు.

◆ ఈ సందర్భంగా ఎన్నికల సిబ్బంది ఒక్కొక్కరికి 20 చొప్పున జాబితాను అందజేశారు. సుమారు 582 పోలింగ్ స్టేషన్లలో వీరు ఓటర్లుగా నమోదయి ఉన్నారు. అంతేకాకుండా ఈ నెల 30వ తేదీ వరకు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం ఉండడంతో ఇప్పటికే 30వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. వాటిలో 22వేల దరఖాస్తులను పరిశీలించామని తెలిపారు.

◆ ప్రస్తుతం 6.69 లక్షల మంది ఓటర్లు ఉండగా కొత్త జాబితా ప్రకటించే లోపు సుమారు 6.90 లక్షలు ఓటర్లు చేరే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అందుకు అనుగుణంగా పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి బీఎల్‌ఓలతో ఇంటింటికి తిరిగి కొత్త ఓటర్లను పరిశీలిస్తున్నట్లు ఎన్నికల అధికారి పులి సైదులు 'సాక్షి'తో అన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఎన్నికల అధికారులు నాగమణి, రహమాన్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జంగ్ 2023 తెలంగాణ

ఓవైపు ఫ్లాగ్‌మార్చ్.. మరోవైపు తనిఖీలు



దుండిగల్‌లో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీస్ బలగాలు



దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద తనిఖీలు చేపడుతున్న పోలీసులు

దుండిగల్: ఎన్నికల వేళ పోలీస్ ఫ్లాగ్‌మార్చ్‌తో పాటు వాహనాల తనిఖీలు చేపట్టారు. దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం సీఐ రామకృష్ణ నేతృత్వంలో దుండిగల్ గ్రామం, గండిమైసమ్మ చౌరస్తాలలో పోలీస్ బలగాల ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించి ప్రజలకు భరోసా కల్పించారు. అదే విధంగా ఔటర్ రింగ్ రోడ్డు, గండిమైసమ్మ చౌరస్తాలోని నర్సాపూర్ రాష్ట్ర రహదారుల్లో వాహనాలను ఆపి తనిఖీలు చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు తమ శాయశక్తులా కృషి చేస్తున్నామని అన్నారు. అందులో భాగంగానే ఫ్లాగ్‌మార్చ్‌తో పాటు తనిఖీలు ముమ్మరం చేశామని సీఐ రామకృష్ణ పేర్కొన్నారు.

'అధ్యక్షుడిని నేనైతే తానని చెప్పుకోవడం హాస్యాస్పదం'

సుభాష్‌నగర్ బీజేపీ అధ్యక్షుడు కంది శ్రీరాములు



సుభాష్‌నగర్: డివిజన్ బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి చేరిన గుబ్బల లక్ష్మీనారాయణ డివిజన్ అధ్యక్షుడిగా చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంది శ్రీరాములు అన్నారు. అధిష్టానం నిర్ణయం మేరకు రెండేళ్ల నుంచి తాను డివిజన్ అధ్యక్షుడిగా పని చేస్తున్నానని అన్నారు. బుధవారం గుబ్బల బీఆర్‌ఎస్‌లోకి చేరుతూ బీజేపీ డివిజన్ అధ్యక్షుడిగా అని పత్రికల్లో రాయించుకోవడం ఆయన దిగజారుడతనానికి నిదర్శమన్నారు. గుబ్బల పార్టీని వీడినంత మాత్రాన డివిజన్‌లో బీజేపీకి పోయేదేమి లేదని పేర్కొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి



గాంధీనగర్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

జీడిమెట్ల: ఓటర్లు ఎలాంటి భయాందోళలకు గురికాకుండా తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని జీడిమెట్ల ఇన్స్‌పెక్టర్ పవన్ అన్నారు. గురువారం రంగారెడ్డినగర్, చింతల్ డివిజన్ల జీడిమెట్ల పోలీసులు సీఐఎస్‌ఎఫ్ జవాన్‌లతో కలిసి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఓటర్లలో ఎలాంటి భయం లేకుండా పోలింగ్‌లో పాల్గొనేలా అవగాహన కల్పించారు. ఓటర్లను ఎవరైనా భయపెట్టినా, బలవంతం చేసినా ఫిర్యాదు చేయాలని ఇన్స్‌పెక్టర్ పవన్ కోరారు.

క్లుప్తంగా

భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి

కుత్బుల్లాపూర్: నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి ఓ సెంట్రింగ్ కార్మికుడు మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన తులసి వాసు(45), వసంతలు భార్యాభర్తలు. వీరు బతుకుదెరువు కోసం గుండ్లపోచంపల్లిలోని లక్ష్మినగర్ కాలనీలో ఉంటున్నారు. వాసు సెంట్రింగ్ కార్మికుడు కాగా, వాసంత కుకింగ్ మాస్టర్‌గా పనిచేస్తోంది. కాగా ఈ నెల 25న స్థానికంగా సెంట్రింగ్ పనికి వెళ్లిన వాసు ప్రమాదవశాత్తు భవనం నాలుగవ అంతస్తు నుంచి జారి పడ్డాడు. వెంటనే అతన్ని తోటి కార్మికులు కొంపల్లిలోని ఆర్క్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా నిర్మాణ ప్రాంతంలో సరైన రక్షణ చర్యలు చేపట్టకపోవడంతోనే తన భర్త మృతి చెందాడని, ఈ విషయమై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రోడ్లు గుంతలమయం.. జనాలకు అపాయం



గుంతల మయంగా మారిన టెక్‌మహీంద్రాకు వెళ్లే దారి..

దుండిగల్: ఆ రోడ్డు నుంచి వెళ్లాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. గుంతలమయంగా మారిన రోడ్డుపై ప్రయాణించాలంటే జంకుతున్నారు. నిత్యం వివిధ పనులపై దుండిగల్ మున్సిపల్, మండల రెవెన్యూ కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దూరం పెరిగినా సరే తిరిగి ప్రధాన రహదారి నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నారు. బహదూర్‌పల్లి టెక్ మహీంద్ర నుంచి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే దారి పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో పనుల కోసం వచ్చే ప్రజలు గుంతల్లో పడి గాయాల పాలైన సంఘటనలు ఉన్నాయి. వీధి లైట్లు లేకపోవడంతో రాత్రి సమయాల్లో గుంతలను గమనించక పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డును వేయాలని స్థానికులు కోరుతున్నారు.

దాడి.. వేడి

- హాట్‌టాపిక్‌గా మారిన ఎమ్మెల్యే వివేకానంద దాడి
- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కు నేతల పరామర్శ
- కోర్టు అనుమతితో కేసు నమోదు చేయాల్సి ఉంటుంది: సూరారం సీఐ



శ్రీశైలంగౌడ్ ఇంటికి తరలి వస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

సుభాష్‌నగర్: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారంలో బుధవారం ఓ టీవీ చానల్ నిర్వహించిన డిబేట్ కార్యక్రమంలో ప్రస్తుత ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌పై దాడి చేసిన విషయం తెలిసిందే. దాడి చేసిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ చూసినా ఇదే హాట్ టాపిక్‌గా మారింది. శ్రీశైలంగౌడ్‌పై కేపీ వివేకానంద దాడి దృశ్యాలు వాట్సాప్‌లో చక్కర్లు కొట్టడంతో ప్రజలు దీని పైనే చర్చించుకుంటున్నారు.

కూన ఇంటికి పోటెత్తిన జనం..

కూన శ్రీశైలంగౌడ్‌పై దాడికి దిగిన విషయమై కార్యకర్తలు, అభిమానులు, నాయకులు కూన ఇంటికి తరలివచ్చారు. బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆయనను పరామర్శించడానికి షాపూర్‌నగర్‌లోని కూన నివాసానికి వచ్చారు. ఉదయం నుంచి టీవీ చానళ్ల ప్రతినిధులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతం జనంతో కిక్కిరిసిపోయింది. దాడిని ఖండిస్తూ బండి సంజయ్ విలేకరులతో మాట్లాడారు.



కూన శ్రీశైలంగౌడ్ ఇంటి వద్ద కార్యకర్తల రద్దీ

రాష్ట్రవ్యాప్తంగా కూనకు మద్దతు..

శ్రీశైలంగౌడ్‌పై దాడిని నిరసిస్తూ బీజేపీ కార్యకర్తలు ఆయనకు మద్దతుగా నిలబడ్డారు. ఏది ఏమైనా ఈసారి కూన శ్రీశైలంగౌడ్‌ను గెలిపించుకొని తీరుతామని కార్యకర్తలు శపథం తీసుకుంటున్నారు.

పోలీసులకు ఫిర్యాదు...

ఎమ్మెల్యే వివేకానంద దాడి చేయడం విషయమై బుధవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ తన అనుచరులతో కలిసి సూరారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు కాపీని ఇన్స్‌పెక్టర్‌కు వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఈ విషయమై గురువారం ఇన్స్‌పెక్టర్‌ను వివరణ కోరగా ఇప్పటికి కేసు నమోదు చేయలేదని కోర్టు అనుమతితో నమోదు చేయాల్సి వస్తుందని తెలిపారు.



బండి సంజయ్ రాక కోసం వేచి ఉన్న వివిధ చానళ్ల ప్రతినిధులు, కార్యకర్తలు

నిర్వహణ చేపట్టరు.. జిమ్ చేయనివ్వరు!



ప్రగతినగర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పార్కులో ఓపెన్ జిమ్ పరికరాలు ఊడిపోయిన దృశ్యం

లక్షలాది ప్రజాధనాన్ని వెచ్చి హంగు ఆర్భాటాలతో ప్రారంభించిన ఓపెన్ జిమ్‌ల నిర్వహణ గాలికొదిలేశారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ వాసవీ లేఅవుట్‌లోని సర్వేపల్లి రాధాకృష్ణన్ పార్కులో ఆరు నెలల క్రితం ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల పాటు ప్రజలు సక్రమంగా జిమ్ పరికరాలను ఉపయోగించుకుని వ్యాయామం చేశారు. అయితే వాటి నిర్వహణ సరిగా చేపట్టకపోవడంతో జిమ్ పరికరాలు విడిపోతున్నాయి. దీంతో అవి ఎక్కడ ఊడిపోతాయోనన్న భయంతో స్థానికులు వ్యాయామం చేసేందుకు జంకుతున్నారు. సంబంధిత అధికారులు జిమ్ పరికరాల నిర్వహణ సరిగా చేపడితే తాము వ్యాయామం చేసుకునే వీలు కలుగుతుందని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని సమీప కాలనీల ప్రజలు కోరుతున్నారు.

– నిజాంపేట్

పగలే వెన్నెల!



జగద్గిరిగుట్ట బస్టాప్ సమీపంలోని ఇందిరా గాంధీ విగ్రహం సర్కిల్ వద్ద వారం రోజులుగా పగలు రాత్రులని తేడా లేకుండా లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. ఈ విషయమై ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని.. ఇకనైనా అధికారులు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

– జగద్గిరిగుట్ట

బతుకమ్మ కుంటలను శుభ్రపరచండి



భూదేవిహిల్స్‌లోని బతుకమ్మ కుంట వద్ద

జగద్గిరిగుట్ట: బతుకమ్మ పండుగా జరుపుకొని 5 రోజులు గడిచాయి. కానీ డివిజన్ పరిధిలోని వివిధ బతుకమ్మ కుంటల వద్ద కుంటలలో వేసిన బతుకమ్మలను తీయలేదు. అటువైపు వెళ్లేవారికి తీవ్రమైన దుర్గంధం వెదజల్లడంతో ముక్కుమూసుకొని వెళ్లక తప్పడం లేదు. అంతే కాకుండా దోమలు కూడా ఎక్కువయ్యాయి. అసలే మలేరియా, టైఫైడ్‌తో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి ఈ బతుకమ్మ కుంటలను వీలైనంత తొందరగా శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



సోమయ్యనగర్‌లోని బతుకమ్మ కుంట వద్ద

కాంగ్రెస్ గ్యారంటీలకు విశేష స్పందన

కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి

రంగారెడ్డినగర్: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని.. రాబోయేది తమ ప్రభుత్వమేనని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డినగర్ డివిజన్‌కు చెందిన పెరికె శివ ఆధ్వర్యంలో గురుమూర్తినగర్, గాంధీనగర్, గిరినగర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే విధంగా జీడిమెట్ల డివిజన్ అయోధ్యనగర్, ప్రసూననగర్, అయోధ్యనగర్, జయరామ్‌నగర్, లక్ష్మినగర్‌లకు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు పద్మారెడ్డి లక్ష్మి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు.

◆ ఈ సందర్భంగా వారికి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన హన్మంతరెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో రాజకీయ సమీకరణలు మారుతున్నాయని అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం హస్తం గతం చేసుకోబోతోందని తెలిపారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగయవతకు ఉపాధి అవకాశాలతో పాటు స్థలం ఉన్న మహిళలకు రూ.5 లక్షలు గృహలక్ష్మి పథకం కింద ఇస్తామన్నారు. అధికార బీఆర్‌ఎస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ప్రజా సంక్షేమం కోసం పని చేసే కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆయా బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



కొలన్ హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు

కష్టపడే వారికే బీజేపీలో గుర్తింపు



ఇంద్రసేనారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్. మల్లారెడ్డి

దుండిగల్: బీజేపీలో కష్టపడి పని చేసే వారికి ఎల్లప్పుడు గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి అన్నారు. త్రిపుర గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన నల్లు ఇంద్రసేనారెడ్డిని త్రిపుర రాజ్‌భవన్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇంద్రసేనారెడ్డి పార్టీకి చేసిన సేవలను గుర్తించి ప్రధాని నరేంద్ర మోదీ గవర్నర్‌గా అవకాశం కల్పించారని మల్లారెడ్డి తెలిపారు.

వెళ్లలేక మధ్యలో స్తంభాలు

- ఇరు శాఖల మధ్య సమన్వయ లోపం
- స్తంభాలు తొలగించకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు

రంగారెడ్డినగర్: ఇరు శాఖల అధికారుల మధ్య సమన్వయం లోపించడంతో ప్రధాన రోడ్లపై ఉన్న విద్యుత్‌స్తంభాలు వాహనాల రాకపోలకు ఆటకంగా మారుతున్నాయి.. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి రోడ్ల విస్తరణ చేపట్టారు. పనుల నేపథ్యంలో రోడ్లపైకి ఉన్న విద్యుత్ స్తంభాలను పక్కకు తొలగించకపోవడంతో విస్తరణ జరిగినా అనుకున్న మేరకు సత్ఫలితాలు ఇవ్వడం లేదు. రోడ్డు మధ్యన, రోడ్డుకు ఆనుకని ఉన్న స్తంభాలు రాకపోకలకు ఆటంకాలు సృష్టిస్తూనే ఉన్నాయి. దీంతో ప్రజాధనం ఖర్చు చేసినా తమకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదని పలువురు వాహనదారులు వాపోతున్నారు.

రూ.3 కోట్లు వెచ్చించి స్తంభాల తరలింపు మరిచి..

◆ ఐడీపీఎల్ నుంచి జగద్గిరిగుట్ట వరకు రోడ్డు చిన్నదిగా ఉండటంతో ప్రమాదాలకు నెలవుగా మారింది. ఈ నేపథ్యంలో రెండు సంవత్సరాల క్రితం రూ.3 కోట్ల నిధులు వెచ్చించి రోడ్డుకు ఇరువైపులా 20 పీట్ల మేర వెడల్పు చేశారు. అయితే విద్యుత్ స్తంభాలను తొలగించకపోవడంతో వెడల్పు చేసిన రోడ్డు ప్రాంతం రాకపోకలకు అనువుగా లేకుండా పోయింది. దీంతో స్తంభాలను ఆనుకుని వాహనాలను నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య మాత్రం యథాతథంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు.

షాపూర్‌నగర్–జీడిమెట్ల రోడ్డు..

◆ షాపూర్‌నగర్ నుంచి సూరారం వరకు రోడ్డు వెడల్పు చేపట్టిన అధికారులు పలు చోట్ల విద్యుత్ స్తంభాలను పక్కకు తరలించ లేదు. దీంతో రోడ్డుకు ఆనుకుని జీడిమెట్ల బస్‌డిపో, షాపూర్‌నగర్ రైతు బజారు ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. అసలే నర్సాపూర్ రాష్ట్ర రహదారి కావడంతో నిత్యం ఆర్టీసీ బస్సులతో పాటు వివిధ పరిశ్రమలు, కళాశాలకు రాకపోకలు సాగించే ప్రైవేట్ బస్సులు, ఇతర వాహనాలతో ఈ మార్గం రద్దీగా ఉంటుంది. రోడ్డుకు ఆనుకునే స్తంభాలు ఉండటంతో తరచూ వాటిని ఢీకొని గాయాలు పాలవుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

సర్కిల్ చౌరస్తాలో..

◆ కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తా నుంచి సర్కిల్ కార్యాలయానికి వెళ్లే రోడ్డులో రెండు, మూడు స్తంభాలు రోడ్డుకు ఆనుకునే ఉన్నాయి. చౌరస్తా కావడంతో వేగంగా వచ్చే వాహనదారులు టర్న్ తీసుకునే క్రమంలో స్తంభాలను ఢీకొనే ఆస్కారముంది. సంబంధిత అధికారులు రోడ్డు విస్తరణ సమయంలో సమన్వయంతో వ్యవహరించి ఉంటే రాకపోకలకు ఇబ్బందులు తలెత్తేవి కావని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్తంభాలను పక్కకు జరిపి సురక్షిత రాకపోకలకు సహకరించాలని వాహనదారులు కోరుతున్నారు.



జగద్గిరిగుట్ట- ఐడీపీఎల్ రోడ్డులో, షాపూర్ నగర్ రైతు బజారు సమీపంలో రోడ్డుపై ఇలా..



కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం రోడ్డులో, జీడిమెట్ల బస్‌డిపో సమీపంలో..